శుభాకాంక్షలు!

"ఎట్లా ఉన్నది ఇవ్వాళ ఒంట్లో?"

మెల్లిగా తలెత్తి చూశాడు రాఘవ.

ఆ గొంతు... ఆ ఆప్యాయమైన పలకరింపు కోసం గంటలకొద్దీ ఎదురు చూస్తున్నాడతను...

నవ్వాడు...

"పరవాలేదు... రా కూర్చో..."

"లేదు... వెళ్లాలి... ఇదుగో భోజనం..." కారియర్ తీస్తూ అంది గంగ.

"గంగా!..." అతని గొంతులో జలదరింపు.

"ఏమిటి?!"

"నీకెందుకింత శ్రమ?!"

కళ్లెత్తి చూసి నవ్వింది... పెదవుల మీద విచ్చే చిరునవ్వు కళ్లల్లో ప్రతిఫలించడం అందమైన అనుభూతివల్ల వచ్చే పరిణామం.

కానీ... కళ్లు నవ్వుతూ, పెదవులమీదకు సుతిమెత్తగా జారి ప్రతిఫలించడం... అదొక అయస్కాంత హేల.

❀ ❀ ❀

గంగ.... "గంగ" అని పిలవబడే పరిస్థితుల్లోనే పుట్టింది. ఆ అమ్మాయి తండ్రి స్కూలు వాచ్‌మాన్. తల్లి రంగి కాలేజిలో ఆయాగా ఉండేది. ఒక సుప్రభాతాన పక్కనే ఉండే కరస్పాండెంటుగారి కారు డ్రైవర్‌తో లేచిపోయింది. కారణం?! "ఈ లేమీ, ఈ అతి మంచి మొగుణ్ని నేను భరించలేను..." అని అర్థమయ్యేట్లు చెప్పిపోయింది.

గంగ తండ్రి అసమర్థుడై ఊరుకున్నాడో, అర్థం చేసుకునే ఊరుకున్నాడో కానీ, ఏనాడూ భార్యగురించి చెడ్డగా మాట్లాడేవాడు కాదు. మాట్లాడనిచ్చేవాడు కాదు.

"ఆ లేచిపోయిన దానికోసం నువ్వేమిటిరా ఇలా?!" బుద్ధుందా లేదా?!" అని తిట్టేవాడు, స్కూలు గోడనానుకుని ఉన్న ఇంట్లో ఉంటూ పౌరోహిత్యం చేసుకునే సుబ్రహ్మణ్యశాస్త్రి.

"ఒద్దు బాబూ! చెడ్డ మాట్లాడినకొద్దీ మనలో చెడ్డతనం వస్తుంది. మంచి ఆలోచిస్తే మైలపడం. రంగి అంటే నా ప్రాణం. 'నాకు ఇది బాగుంది... ఇలాగే ఉంటాను...' అనే అధికారం దానికి లేదా?! అదీ మనిషేగా?... దానిమీద నాకు

ఉన్నది ప్రేమ బాబూ, హక్కు కాదు! ఎటొచ్చీ... ఈ పసితల్లే..." గంగను గుండెలకు హత్తుకుని కన్నీళ్లు పెట్టుకునేవాడు వాచ్‌మేన్...

"అణవమల శోధనార్థం..." అని ఆచమనీయం చేసే శాస్త్రిగారికి చేతల వైబ్రేషన్ అర్థం కాలేదేమో కానీ మంచిగా ఆలోచించే వాచ్‌మేన్ దాన్ని సంపూర్ణంగా ఆచరణలో పెట్టాడు. గంగకు అలా చెప్తూనే పెంచాడు.

రాఘవ... శాస్త్రి కొడుకు.

అతనికి డిగ్రీ వచ్చినా, ఉద్యోగం లేదని... "రోజూ నీకు ఇంట్లో దండగ పిండం పెట్టడానికి ఎవరూ సిద్ధంగా లేరు. అయినా నీ అంత పనికిమాలిన వాజెమ్మను నేను ఎక్కడా చూడలేదు..." అంటూ మాటలే మంత్రాల్లాగా, సజెషన్స్‌గా మారతాయని అర్థం చేసుకోని శాస్త్రి అతణ్ణి నిర్వీర్యుణ్ణి, నిర్లిప్తుణ్ణిగా తయారుచేశాడు.

"మా గంగతల్లి అందం ఆకాశం... గుణానికి భూదేవత..." వయసొచ్చి సోయగంగా తయారైన బిడ్డను ఆప్యాయంగా చూసుకుంటూ అనేవాడు వాచ్‌మాన్ నెరసిన మీసాల్లోంచి నవ్వుతూ...

గంగ చదువుకున్నది... పదవ తరగతి దాకా... ఫ్యాక్టరీలో చిన్న తరగతి ఉద్యోగినిగా చేరింది.

కరెస్పాండెంటుగారే ఉద్యోగం వేయించారు, ఆయన కొడుకుదే ఫ్యాక్టరీ కనుక.

ఆ కొడుకు పదవక్లాసు కూడా పాస్ కాలేదు. తండ్రి విద్యాసంస్థలు స్థాపించినా కొడుకు 'స్థితి'లో మార్పులేదు. డబ్బున్నవాడు కాబట్టి ఫ్యాక్టరీ యజమాని అయ్యాడు.

గంగను మనిషిగా చూసేవాడు కాదు అతను. భోగ్యవస్తువుగా... "ఎప్పుడైనా వీలైతే..." అన్నట్లే చూసేవాడు. తండ్రి భయం అతణ్ణి ఆ సాహసం చెయ్యనివ్వలేదు. పనివాళ్ల గ్రేడ్‌నుబట్టికాక, గుణాన్నిబట్టి గౌరవం ఇచ్చే కరస్పాండెంటుగారు గంగను బిడ్డలా చూసేవాడు.

గంగ, రాఘవ చిన్నప్పటినుంచి స్నేహితులు.

ఫ్యాక్టరీ యజమాని మనస్తత్వం, మాటలు గంగ చెప్పినప్పుడల్లా కచ్చగా వినేవాడు రాఘవ.

"డబ్బున్న మదం. నాకే అంత డబ్బు, అధికారం ఉంటేనా?!"

"ఏం చేస్తావు?!" అన్నట్లు కళ్లెత్తి చూసేది గంగ.

"ఏమిటి అట్లా చూస్తావు?! నేనేం చెయ్యలేనా?! దేముడు నాకు ఆ అవకాశం ఇవ్వలేకానీ." రెచ్చిపోతూ అనేవాడు రాఘవ.

మధ్యతరగతి నిరుద్యోగి కథ ఎప్పుడూ ఒకటే. ఇంట్లోవాళ్ల ఉదాసీనం... బైటవాళ్ల వేళాకోళం.

అప్పుడే రాఘవకు యాక్సిడెంట్ అయింది.

దెబ్బతీసిన బస్సువాడి దగ్గరనుంచి కాంపన్సేషన్ అడగాలన్నా రికమెండేషన్, పలుకుబడి ఉండాలని తెలిసి, ఏం చెయ్యలేక కొడుకును నానామాటలూ అన్నాడు శాస్త్రి.

డబ్బు ఉత్పత్తి చెయ్యని బిడ్డలకు పనికిరాని యంత్రాలకు ఉన్న విలువే ఉంటుంది శాస్త్రిలాంటివాళ్ల దృష్టిలో

ఇంటిల్లిపాదీ వేరే ఊరు పెళ్లికి వెళ్లారు అతడ్ని గవర్నమెంటు వాళ్ల బ్రెడ్, పాలకు వదిలిపెట్టి... తండ్రి ఇచ్చివెళ్ళిన యాభైరూపాయలు తనకు కావలసిన అవసరాలకు రెండు రోజులు కూడా రావని తెలుసు రాఘవకు.

నిరాశ, నిస్పృహ, చచ్చిపోదామన్న నిర్ణయం బాధ, కంట్లో నీరు...

అప్పుడు వచ్చింది గంగ నవ్వుతూ... కారేజీ పట్టుకుని. అలా రోజూ వచ్చేది పదిరోజుల కాలం.

ఈ పదిరోజుల్లో రాఘవ ఆలోచనలలో జోలెడు మార్పులు...

అవి ఎదిగి, తీగెలు సాగి, ఊయలలు వేసి...

"గంగను ఎలా పెళ్లి చేసుకోవాలి?" అన్నదాకా వెళ్లాయి.

ఫ్యాక్టరీ నుంచి రోజూ అక్కడ చదివి వదిలేసిన పేపరు తెచ్చేది గంగ వాంటెడ్ కాలమ్స్ చూసేందుకు. పేపరు చూస్తూ అరిచాడు రాఘవ-

"గంగా! నా డైరీ తీసుకురా" అని. తెచ్చింది.

"ఏమిటి బాబూ! అదేమిటి లాటరీ టిక్కెట్టు చూస్తున్నారు?!" అతని చేతిలో టిక్కెట్టు.

రెండు క్షణాలు చూసి, అతడు పేపర్లో మునిగిపోగానే "వస్తాను బాబూ!" అని వెళ్లిపోయింది గంగ.

"లక్షరూపాయలు..." రాఘవ కళ్లు తిరిగిపోతున్నాయి. దేవుడు ఉన్నాడు. ఎంత గొప్ప అవకాశమిచ్చాడు?. ఏమిటేమిటో ఊహాలు?!

కానీ... ఈ డబ్బు వస్తే... ఈ డబ్బు వస్తే తనవాళ్లు తనదైన ఏ ఒక్క ఆలోచనా సాగనివ్వరు. తను పనికిరానివాడైతే ఏమో కానీ, ప్రయోజకుడైన కొడుకు పెట్టుబడి అని తెలిసిన మరుక్షణం గంగను తన దరిదాపులకు రానివ్వరు... దరిద్రంలో చెయ్యగల కొన్ని ధైర్యాలు. డబ్బున్నవాళ్లు చెయ్యలేరని అతని చుట్టూ ఉన్నవాళ్ల జీవితాలు పాఠాలు చెప్పాయి.

తన చుట్టాలు, జనాలు తనని బ్రతకనివ్వరు.

ఏమేమిటో పిచ్చి ఆలోచనలు... ఊహల్లో బాధలు, ఈ లాటరీ టిక్కెట్టుతో గంగను తీసుకుని రైలెక్కి దూరంగా పారిపోతే... ఛా! గంగ... గంగ రాదు... అయినా ఎలా అడగాలి? వాళ్లనాన్న పెళ్లాం లేచిపోయి, కూతురు కూడా అదే దారిపడితే గుండె ఆగి చచ్చిపోతాడు.

ఆలోచిస్తూ అలా నిద్రలోకి వెళ్లిపోయాడు రాఘవ.

ఫ్యాక్టరీ మధ్యాహ్నం షిఫ్ట్‌లో ఉన్న గంగ ఆలోచిస్తోంది.

"గంగా! రాఘవబాబుకు ఎట్లా ఉందే? అదేం తల్లీ తండ్రీ... అట్లా వదిలేసిపోయారు?! అదిసరే గానీ, రాఘవ బాబేమన్నా లాటరీ టిక్కెట్టు గురించి మాట్లాడాడా?!" అడిగాడు మిషన్ల మీద మేస్త్రీ వీరయ్య.

ఉలిక్కిపడింది గంగ.

"ఏం? ఎందుకు?"

"ఏం లేదే... నాకన్నా ఇద్దరి ముందు క్యూలో నిలబడి ఈయన టిక్కెట్టు కొన్నాడు. నా నెంబరుకన్నా రెండు నెంబర్లెక్కువ. ఆ నెంబరుకు లాటరీ వచ్చిందని అనుమానం నాకు..."

పర్మిషన్ తీసుకుని ఫాక్టరీ పక్కన ఉన్న హాస్పిటల్‌కు వెళ్ళింది గంగ.

నిద్రపోతున్నాడు రాఘవ, అతని పక్కన డైరీలో టిక్కెట్టు నెంబరు.

మూడో నాటికల్లా తిరిగి వచ్చిన రాఘవ కుటుంబం రాఘవను ఒక్కసారిగా "ప్రయోజకుడివి" అన్నది. చుట్టూ అందరూ నీ అంత అదృష్టవంతుడు లేడన్నారు...

"దెబ్బ తగిలిందని ఊళ్ళో ఉన్నవాళ్ళకు చెప్పద్దుటా? అయినవాళ్ళం కదా..." ఎదిగిన కూతురుతో వచ్చిన మేనమామ యాపిల్‌పళ్ళు తెచ్చాడు.

గంగ కారియర్‌తో వచ్చి, ఈ కోలాహలమంతా చూసి నిశ్శబ్దంగా తిరిగి వెళ్ళిపోయింది.

"ఎంత పనిచేశావు గంగా! నిన్నెవరు నా లాటరీ టిక్కెట్టు సంగతి బైట పెట్టమన్నారు?!" ఫ్యాక్టరీ దగ్గరకు వచ్చి అడిగాడు రాఘవ వారం రోజుల తరవాత.

అతని కళ్ళల్లో ఆప్యాయత, బాధ.

"ఏం బాబూ?" అతని కళ్ళల్లోకి చూస్తూ అడిగింది.

"ఎంత అందంగా ఉన్నాడు రాఘవబాబు..." అనుకున్నది గంగ. పర్సనాలిటీ ఇచ్చే అందం కన్నా... ఆప్యాయతల అనుభూతులు ప్రతిఫలించే అందం ఎంత గొప్పదో అర్థం చేసుకోగలిగిన గంగ.

"ఏమంటావేమిటి? నీకు తెలియడం లేదా? అందరూ నన్ను దిక్కుమాలిన వాడివని వదిలేస్తే, నువ్వే నాకు దిక్కయ్యావు. ఏమిటి ఇప్పుడు నిన్ను నాకు దూరంగా నిలబెట్టేది? ఈ డబ్బు కదూ? ఈ జనం అంతా ఇప్పుడు ఎవరు? ఎందుకు నా చుట్టూ ఇలా తిరుగుతున్నారు? నాకు తెలియదా? అర్థం కాదా?"

"అంటే?... మీకు ఆ డబ్బు ఒద్దా?" ఆశ్చర్యంగా అడిగింది గంగ.

"ఏది నిన్ను నాకు దూరం చేస్తుందో అది నాకు వద్దు గంగా! అందుకే ఆ లాటరీ టిక్కెట్టు చించేద్దామనుకున్నాను. కానీ, నువ్వు... నువ్వే అందరికీ చెప్పావు... ఇప్పుడు చూడు..." పసిబిడ్డలా ఉడుక్కున్నాడు రాఘవ.

"అంటే... అంటే... అన్ని బాధల్లో, డబ్బు కష్టాల్లో ఉద్యోగం లేదని కన్నవాళ్ల చేత మాటపడ్డ మీరు... ఇంత అవకాశాన్ని నా కోసం... నా కోసం దూరం

చేసుకుందామనుకున్నారా? లక్షరూపాయలు... అంటే, ఎంత డబ్బు? మీకు ఎంత అవసరం? హూఁ, గంగలు బోలెడి మంది బాబూ... కానీ, లక్షరూపాయలు... వాటి విలువ వేరు... వెళ్లి ఏం చెయ్యాలో ఆలోచించండి..." వెళ్లబోయింది గంగ.

అడ్డం వచ్చాడు రాఘవ.

"అందరూ గంగలు కాలేరు... కారు... నువ్వు... నువ్వు..." అతని గొంతులో ధ్వనికి పులకించిపోయింది గంగ.

"ఈ ఆలోచనే గొప్పగా ఉన్నది రాఘవయ్యబాబూ! ఇంకేమీ ఒద్దు నాకు... మీరు వెళ్లండి. డబ్బు ఏం చెయ్యగలదో నాకూ కొంచెం తెలుసు. దేముడి లాంటి మా నాన్నను వదిలి అమ్మ వెళ్లిపోయిందంటే ఈ డబ్బు కోసమే... నా కోసం ఒక నిరుద్యోగి లక్షరూపాయలు ఒద్దు అనుకున్నాడంటే... నవ్వొస్తోంది మీ అమాయకత్వానికి. వస్తాను బాబూ... పనుంది..."

"నన్ను నమ్ము గంగా!" నిస్సహాయంగా అన్నాడు రాఘవ.

"నమ్ముతాను... మీరు ఈ డబ్బు మీదై, గొప్పవారైన తరవాత కూడా ఎలా ప్రవర్తిస్తారో చూసినప్పుడు... అప్పుడు... అప్పుడు నమ్ముతాను బాబూ... వస్తాను."

వెళ్లిపోయింది గంగ.

❀ ❀ ❀

ఆ అవకాశం ఐదేళ్ల తరవాత వచ్చింది గంగకు. స్వయం ఉపాధి పథకం కింద లోన్ శాంక్షన్ చేసే ఆఫీసర్ను చూడటానికి వెళ్లింది గంగ. ఆమెలాంటివారు బోలెడుమంది.

"అర్జీకి ఐదువందలు ఇట పరిస్తే ముందు పేపర్లు కదుల్తాయి... తరవాత పై ఆఫీసర్కు ఐదువేలు వస్తు రూపంగా, ఐదువేలు నగదు రూపంగా... ఈరకంగా రేట్లు..."

గాలిలో మాటలు గడ్డకట్టుకుంటున్నాయి.

చెంపన చెయ్యి పట్టుకుని ఓపిగ్గా నిరీక్షిస్తోంది గంగ. తన వంతు రాగానే స్ప్రింగ్ డోర్ తెరిచి లోపలికి వెళ్లింది.

"నమస్కారం..."

"అరె గంగా!... నువ్వు – నువ్వేనా?!"

"ఔను..." అన్నట్లు తలూపింది. విషయం చెప్పింది.

"నీ అప్లికేషన్ వచ్చిందా? చూడనే లేదే?! ఎలా వున్నావు? ఏం చేస్తున్నావు?"

"అక్కడే ఉన్నాను... నాన్నకు పక్షవాతం వచ్చింది."

తలెత్తి చూశాడు.

"నా పెళ్లికి రాలేదేం గంగా?!"

కుర్చీమీద గీతలు గీస్తూ నిలబడింది.

పసుపు పెట్టిన శుభలేఖ... ఇంటి ముంగిట్లోకి ఎవరిచేతో పంపిన శుభలేఖ... కనీసం వచ్చి ఇవ్వలేని శుభలేఖ.

"నన్నెవరు పిలిచారు బాబూ! నాకు కావలసింది మనసు పిలుపు. కార్డు మీద అచ్చొత్తిన అక్షరాల ఆహ్వానం కాదు..."

ఈ మాటలు అనలేదు గంగ... ఆమె గంగ... అనదు, కానీ,

ఎదుటివాళ్లకు ఆమె ఏమి ఆలోచిస్తోందో ఆమె కళ్లు చూస్తే అర్థమైపోతుంది.

ఉలిక్కిపడి కళ్లు దించుకున్నాడు రాఘవ.

"ఏమిటి? ఆ కరస్పాండెంట్‌గారి పుత్రరత్నం ఇల్లు వాకిలి అన్నీ ఇస్తాను. ఉంపుడు గత్తెగా రమ్మనమని ఏవేవో అన్నాడట. అంత పొగరేమిటి ఆ స్కౌండ్రల్‌కి... మనుషుల్ని కొనుక్కుందామనా?" సిగరెట్టు తాగుతూ రాకింగ్ చెయిర్‌లో అటూ ఇటూ ఊగుతూ అన్నాడు రాఘవ.

పొగరు... నవ్వొచ్చింది గంగకు. అంటే అర్థమేమిటో?...

"మాట్లాడవేం? అరె కూర్చో... రంగయ్యా.. రెండు కాఫీ చెప్పు."

"ఏమిటి ఆలోచిస్తున్నావు గంగా... కూర్చో..."

స్థిరంగా నిలబడే అన్నది గంగ.

"ఆయన అన్నమాటలకు ఒప్పుకుని ఉంటేనే బాగుండేది రాఘవబాబూ! జీవితం మీ భాషలో చెప్పాలంటే 'సెటిల్' అయిపోయేది... ఈ రోజు ఇలా స్వయం ఉపాధి కేంద్రం ఆఫీసు దగ్గర ఐదు గంటలు పడి ఉండక్కర్లేక పోయేది. ఆయన పెట్టిన షరతులకు ఒప్పుకుని ఉంటే, ఈరోజు కార్లో వచ్చి మిమ్మల్ని మా ఇంటికి భోజనానికి తీసుకెళ్లేదాన్ని... ఖరీదైన రోజాపువ్వులతో, మరింత ఖరీదైన చిరునవ్వుతో మీరు మా ఇంట్లోకి వచ్చేవారు. ఇవ్వాళ్టిలాగా నన్ను కూర్చోమనాలా ఒద్దా, కాఫీ తెప్పించాలా అక్కర్లేదా? అనే పరిస్థితిలో మీరూ ఉండక్కర్లేదు. నేనూ ఉండక్కర్లేదు... ఔనా?."

"గంగా!" ఉలిక్కిపడ్డాడు రాఘవ. కొంచెం ఖంగారు కూడా పడ్డాడు.

"మా నాన్న పెంపకంలో బీదరికం నాకు ధైర్యాన్నిచ్చింది బాబూ! దైన్యం ఇవ్వలేదు. మీరు ఆ రోజు అన్నమాటలు చాలా కరెక్టు రాఘవ బాబూ!"

"ఏ మాటలు?" అయోమయంగా అన్నాడు.

"నేను లాటరీ టిక్కెట్టు బైటపెట్టానన్నప్పుడు... మనిద్దరి మధ్య ఎంత దూరం చూడిప్పుడు? అన్నారు. అది ఆ రోజే మీ మనసు గుర్తించింది. నాకు ఇప్పుడు చాలా చాలా అర్థమైంది బాబూ!"

"కూర్చో గంగా! ప్లీజ్... ఏమిటంటావు? హుం! నీ స్థితిలో ఉంటే నేనూ అలాగే మాట్లాడతానేమో!... కానీ, ఈ డబ్బు సుఖమివ్వదు గంగా!... మన జీవితాల్ని ఇది శాశిస్తుంది. మనకు ఏం కావాలో తెలుసుకోనివ్వదు. ఏం చెయ్యాలో చెపుతుంది."

"కరెక్టు బాబూ!" చప్పట్లు కొట్టింది గంగ.

"కరెక్టు... మనకు నిజంగా ఏం కావాలో తెలుసుకోనివ్వనిది ఏదీ మనకు ఒద్దు అనుకుంటే కానీ, జీవితం అర్థం కాదు. అదే నేను చెప్పబోయింది... అదే నాకు అర్థమైంది అన్నానే... అదే..."

"లేదు గంగా!" తల విదిలిస్తూ అన్నాడు రాఘవ

"నేను నువ్వు అన్నట్లు ఆలోచించకుండా బ్రతకడం లేదు. ఈ రకం జీవితం శాశించే పనులు యాంత్రికంగా చేస్తున్నా, మనసు ఎప్పుడూ నాకు కావల్సిన క్వాలిటీ విషయాల గురించి తట్టి చెబుతూనే ఉన్నది. దాని మాట వినకూడదనే చాలా తప్పులు చేసి మరింత బిజీగా నటిస్తూ వుంటాను. ఆనాడు నన్ను అందరూ మాకు అక్కర్లేదని దిక్కులేకుండా వదిలేసినప్పుడు, కాటుక కళ్లతో, కారియర్‌తో నువ్వు ఇచ్చిన ఆప్యాయత, పెట్టిన అన్నం మర్చిపోలేను. ఆ పది రోజుల్లో రోజు రోజుకు నువ్వు నాకు ఎంత దగ్గర అయ్యావు! నీ దగ్గరతనం నన్ను ఎంత గొప్పగా, ఎంత ఉన్నతుడిగా ఆలోచింపచేసేది? డబ్బు సంపాదించలేని వెధవ అని అయినవాళ్లు వదిలేసిన స్థితిలో ఏ శక్తినన్ను లక్షరూపాయల లాటరీ టిక్కెట్టు చించెయ్యడానికి ధైర్యమిచ్చింది?! ఇవ్వాళ అయిదు వేలకు కక్కుర్తిపడే నేను, ఆ రోజు లక్షరూపాయలు ఎందుకు "ఒద్దు' అనుకున్నాను?

"ఇప్పుడు ఆ ధైర్యం... ఆ ధైర్యం ఏది గంగా?" జుట్టులో చేతివేళ్లు పోనిస్తూ బాధగా అన్నాడు రాఘవ.

అతణ్ణి చూస్తే జాలివేసింది గంగకు.

"మీరు చాలా అదృష్టవంతులు బాబూ! కనీసం ఏది పోయిందో, ఏమిటి కావాలో... దాని పరిధి గురించి అయినా ఆలోచిస్తున్నారు. చాలామంది ఈ అశాంతి దేనికో తెలియక ఎంత నరకం అనుభవిస్తున్నారో? మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు! మీకు ప్రమోషన్ రావాలనో, మరిన్ని లక్షలు చేరాలనో నేను ఈ మాటలు అనడం లేదు బాబూ! మీరన్నారే... ఆ పోగొట్టుకున్న భావం ఏమిటి? అని... అది... మీకు రావాలని శుభాకాంక్షలు తెలుపుతున్నాను... వస్తాను..." వెనక్కు తిరిగింది గంగ.

"గంగా!... నీ అప్లికేషన్..."

"అది చాలా అడుగున ఉన్నదనీ, నాకు లోన్ శాంక్షన్ అయ్యే అర్హతలు అన్నీ ఉన్నా, నాకన్న ముందు ఆ ఇచ్చే అర్హతను మీ దగ్గర చాలామంది కొనేశారని నాకు తెలుసు రాఘవబాబూ! ఎప్పుడూ నా గురించి కొంచెం ఆలోచించమని మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేదు... ఇప్పుడూ పెట్టను... వస్తాను..."

అవతలనించి వస్తున్న ఎవరికో స్ప్రింగ్ డోర్ టపీమని తగిలింది.

"అబ్బ... నుదురు పగిలిపోయింది... ఏమిటా పొగరు, అమ్మాయీ?"

చురుగ్గా చూసింది ఆవిడను గంగ...

"రాజేశ్వరీ!... ఆ అమ్మాయి గంగనీ... గంగా!... ఈవిడ నా భార్య..."

నవ్వుతూ నమస్కారం పెట్టింది గంగ.

చేనేతచీర, మట్టిగాజులు, తెల్లరాయి ముక్కుపుడక... అలంకారాలు, వాటి ఖరీదులనుబట్టి మనుష్యులకు అర్హతలను లెఖ్ఖవేసే రాజేశ్వరీ దేవికి గంగ కంటికి ఆనలేదు.

ఈసడింపుగా మొహం తిప్పుకున్నది. జరీ వెంకటగిరి చీరలో చుట్టి, రవ్వలు అతికించిన స్థూలకాయాన్ని కుర్చీలో ఇరికించి.

"అబ్బా... కూల్ డ్రింక్స్ తెప్పించండీ... ఏమి ఎండలు? ఏడీ ఈ ఫ్యాన్ ఎక్కడ చచ్చాడు?" అంది.

రాఘవ ,ఇబ్బందిపడుతున్నాడు.

గంగ పెదవిపై సన్నని చిరునవ్వు.

'ఎంత జాలిపడవలసిన స్థితిలో ఉన్నావు రాఘవబాబూ! ఎన్నింటికని నిన్ను నువ్వు తాకట్టు పెట్టుకుంటావు?"

ఆ అడగని ప్రశ్నలు గాలిలో తేలి రాఘవ చుట్టూ తిరుగుతూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

❀ ❀ ❀

"ఏంటమ్మా... అలుపుగా వున్నదా?"

సార్టింగ్ చేస్తున్న గంగను అడిగింది మహాలక్ష్మమ్మ. "నీకు లోన్ శాంక్షన్ కాలేదంటగా... అదృష్టం ఉండాలి దేనికైనా... అదికూడా లంచం ఇస్తేకానీ దొరకదాయె..."

"ఫరవాలేదులే లక్ష్మమ్మా! అదృష్టం సంగతి దేముడెరుగును. చాలా చాలా అదృష్టాలలాంటి దురదృష్టాలు పట్టకపోవడం కూడా అదృష్టమే..." ఆలోచిస్తూ అన్నది గంగ.

"గంగా! నీకు ఏదో కవరొచ్చింది..."

గ్రీటింగ్ కార్డ్!

"గంగా! కంగ్రాట్స్... నీ అప్లికేషన్ శాంక్షన్ అయింది. నీ శుభాకాంక్షలు నేను మర్చిపోలేను... నువ్వు అవకాశం వస్తే ఎన్ని చెయ్యగలవో, ఎన్ని నేర్పగలవో నాకు అర్థమైంది... ఆల్ ది బెస్ట్.

నీ

రాఘవ"

మరొక్కసారి గంగ కళ్లల్లో తళుక్కుమన్న వెన్నెల పెదవి మీదకు ప్రతిఫలించింది.

('వనిత' - ఆగస్ట్, 1995)